క్లుప్తంగా

కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



గుమ్మడికాయలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కె బిట్రగుంట గ్రామంలోని శ్రీ కాలభైరవస్వామి దేవస్థానంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి వేలాదిగా తరలివచ్చి ఆలయంలో పూజలు నిర్వహించి గుమ్మడికాయలో దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త పాపిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీ



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ ప్రకాశం

కనిగిరిరూరల్: కలెక్టర్ రాజబాబును ఎంపీపీ దంతులూరి ప్రకాశం ఆదివారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన పలు విషయాలను, సమస్యలను కలెక్టర్ విన్నవించినట్లు తెలిపారు. తొలుత కలెక్టర్ రాజబాబును సన్మానించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై వెంకటేశ్వరనాయక్

సీఎస్‌పురం(పామూరు): బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం తాగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై యం.వెంకటేశ్వరనాయక్ అన్నారు. సీఎస్‌పురంతోపాటు మండలంలోని పలుగ్రామాలు, రోడ్లవైపునగల బహిరంగ ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్లవెంట మద్యం తాగి పాదచారులు, వాహనదారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే పరిస్థితులు నెలకొంటున్నాయని, వారిని ఉపేక్షించేది లేదని కౌన్సెలింగ్ ఇచ్చారు.

సర్పంచ్ క్షమాపణలు చెప్పాలి



అంగన్‌వాడీవద్ద నిరసన తెలుపుతున్న ఎస్టీ కాలనీవాసులు

సీఎస్‌పురం(పామూరు): తమను దొంగలుగా పేర్కొంటూ మాట్లాడిన సీఎస్‌పురం సర్పంచ్ వెంటనే తమకు క్షమాపణలు చెప్పాలని సీఎస్‌పురం యానాది కాలనీ, పాములవారి కాలనీలకు చెందిన ప్రజలు డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా ఆదివారం స్థానిక అంగన్ అంగన్‌వాడీ కేంద్రంవద్ద వారు నిరసన చేపట్టారు. సీఎస్‌పురానికి చెందిన పాముల, యానాది వారు దొంగతనాలు చేస్తున్నారని, పంచాయతీ స్థలాలు ఆక్రమించుకుని అమ్ముకుంటున్నారని సర్పంచ్ పద్మావతి ఇటీవల పత్రికా ప్రకటన చేయడం విడ్డూరమన్నారు. తాము మోటార్ వైర్లు దొంగతనం చేసినట్లు ఆరోపించారని, ఆమె సర్పంచ్‌గా ఉన్న 4 ఏళ్ల కాలంలో ఏ బోర్ మోటార్‌వైర్లు చోరీకి గురయ్యాయో చెప్పాలన్నారు. తమ కాలనీల్లో సమస్యలు పట్టని సర్పంచ్ తమను దొంగలని నిందలు వేయడం హేయమని, సర్పంచ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలన్నారు.



పొన్నలూరు తహసీల్దార్ కార్యాలయం



పొన్నలూరు మండల పరిషత్ కార్యాలయం

అర్జీదారుల అవస్థలు..!

- ప్రభుత్వ కార్యాలయాల దగ్గర కనిపించని పబ్లిక్ టాయిలెట్లు
- అవసరమైనప్పుడు ప్రజలకు తప్పని ఇబ్బందులు
- మరుగుదొడ్లు లేక సతమతమవుతున్న మహిళలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఎంపీడీఓ కార్యాలయ వద్ద వేచి ఉన్న అర్జీదారులు

పొన్నలూరు: అర్జీదారులతో నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు దగ్గర పబ్లిక్ టాయిలెట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్దకు నిత్యం పలు రకాల సమస్యలపై అర్జీదారులు వస్తుంటారు. ప్రతి రోజు ఏదో ఒక సమస్యపై పదుల సంఖ్యలో మండల నలుమూలల నుంచి కార్యాలయాల దగ్గర దర్శనమిస్తుంటారు. వీరితో పాటు రోజు ఆయా కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు. వీరందరికి ఏ ఒక్క కార్యాలయం పరిధిలో అందుబాటులో పబ్లిక్ బాత్‌రూంలు, టాయిలెట్లు లేవంటే అతిశయోక్తి కాదు. దీంతో కార్యాలయాల దగ్గరకు వచ్చే ప్రజలతో పాటు, ఉద్యోగులు సైతం అత్యవరసర సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతూ నరకయాతన అనుభవిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చేసేదే లేక అవసరమైనప్పుడు పురుషులు కార్యాలయాలకు దూరంలో ఉన్న ఆరుబయటకుపోయి తమపని కానిచేస్తున్నారు. కానీ మహిళలు మాత్రం ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇంటికి వెళ్లే వరకు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. అధికారులను కలిసి వారి సమస్యను పరిష్కరించుకునేంత వరకు అక్కడే ఉంటూ ఇంటికెళ్లే వరకు తమ కాలకృత్యాలు తీర్చుకోలేక నానా అగచాట్లు పడుతున్నారు.

కార్యాలయాన్నీ ఒకే చోట..

వాస్తవంగా పొన్నలూరులో తహసీల్దార్, మండల పరిషత్, వెలుగు, ఉపాధిహామీ, వ్యవసాయ, హౌసింగ్, విద్యుత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రం ఇలా ప్రధాన శాఖల కార్యాలయాలన్నీ ఒకే చోట ఉన్నాయి. దీంతో ఆయా సమస్యలపై వివిధ పనుల నిమిత్తం నిత్యం వందలాది మంది ప్రజలు, మహిళలు ఈ కార్యాలయాలకు వస్తుంటారు. ఇటువంటి క్రమంలో ఈ కార్యాలయాల వద్ద ప్లబిక్ టాయిలెట్లు నిర్మించకపోవడంతో వచ్చే అర్జీదారులతో పాటు ఉద్యోగులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆఫీసుల దగ్గరకు వచ్చే మహిళలు పడరానిపాట్లు పడుతున్నారు. ఈ సమస్య కొన్నేళ్లుగా ఉన్నా పరిష్కరించే వారు కనిపించడం లేదు.

కనీస వసతులు కరువు...

ప్రభుత్వ కార్యాలయాల దగ్గర కనీస వసతులు కరువై ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. వాస్తవంగా కార్యాలయాల దగ్గర పబ్లిక్ టాయిలెట్లు నిర్మించడానికి పెద్దగా ఖర్చుమే కాదు. సుమారుగా రూ.2 లక్షల నిధులు కేటాయిస్తే రెండు, మూడు బాత్‌రూంలు నిర్మించి కొంతమేర సమస్యను పరిష్కరించవచ్చు. అయితే గత ప్రభుత్వంలో వెలుగు కార్యాలయం దగ్గరకు వచ్చే మహిళలు, ఉద్యోగస్తుల సౌకర్యార్థం రెండు మరుగుదొడ్లును నిర్మించారు. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో కార్యాలయాల దగ్గర పబ్లిక్ టాయిలెట్లు నిర్మించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల వద్ద పబ్లిక్ టాయిలెట్లు నిర్మించి ఉన్న సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ కార్యాలయాల దగ్గర పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి. టాయిలెట్లు లేకపోవడంతో పనుల నిమిత్తం కార్యాలయాల వద్దకు వచ్చే అర్జీదారులు అవసరమైనప్పుడు కాలకృత్యాలు తీర్చుకోవడాని తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ సమస్య కొన్నేళ్లుగా ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. – మన్నెం పద్మ, సర్పంచ్ ఉప్పలదిన్నె




అధికారులు స్పందించాలి

కార్యాలయాల ఆవరణలో పబ్లిక్ టాయిలెట్లు లేక పలు సమస్యలపై వచ్చే అర్జీదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎంతో మంది అధికారులు విధులు నిర్వహించి పోతున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై అధికారులు స్పందించి కార్యాలయాల దగ్గరకు వచ్చే ప్రజల సౌకర్యార్థం టాయిలెట్లు నిర్మించడానికి కృషి చేయాలి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి. – దాసరి రవి, వేంపాడు

దుష్ట శిక్షణ..శిష్ట రక్షణ..

- నేటి నుంచి దసరా శరన్నవరాత్రి వేడుకలు
- శరన్నవరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయాలు



భైరవకోనలో విశిష్ట అలంకరణలో త్రిముఖదుర్గాదేవి అమ్మవారు

పామూరు: దసరా శరన్నవరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. తొమ్మిదిరోజులపాటు వివిధ రూపాలలో కొలువుదీరి నిష్ఠా గరిష్ఠమైన దీక్షతో మహర్నవమి నాడు మహిషాసురుడిని వధించి, విజయదశమినాడు భక్తుల పూజలు అందుకుంటుంది. శరన్నవరాత్రి వేడుకలు నేడు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం ఆలయాలను విద్యుత్‌దీప కాంతులతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. పట్టణంలోని సవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం, రమాసమేత వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం, వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయం, రుక్మిణి సత్యభామాసమేత మదనవేణుగోపాలస్వామి ఆలయం, వరదరాజస్వామి ఆలయం, సాయిబాబా ఆలయం, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన వల్లూరమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఈఓ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని 22న బాలత్రిపుర సుందరీదేవిగా, 23న గాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న కాత్యాయనిదేవిగా, 26న శ్రీ మహా లక్ష్మీదేవిగా, 27న లలితా త్రిపురసుందరీదేవిగా, 28న శ్రీ మహా చండీదేవిగా, 29న శ్రీ సర్వసతిదేవిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబర్ ఒకటిన మహిషాసుర మర్దిని దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఈఓ రమేష్ తెలిపారు.

సీఎస్‌పురం(పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం మండలంలోని భైరవకోనలో నేడు సోమవారం నుండి దసరా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సీఎస్‌పురంలోని కామాక్షీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి, అయ్యలూరివారిపల్లెలోని శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. వేడుకులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి తెలిపారు.



పామూరులో ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలో వాసవీమాత ఆలయం



వల్లూరమ్మ ఆలయం

పాఠశాలల్లో ముందస్తు దసరా సంబరాలు



మహిషాసుర సంహార ఘట్టంలో నవదుర్గల వేషధారణలో విద్యార్థినులు



నవదుర్గల వేషధారణలోవిద్యార్థినులు

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన దసరా ముందస్తు సంబరాలు అలరించాయి. ఈ సందర్భంగా చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకునే దసరా నవరాత్రుల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నవదుర్గల నృత్యం, మహిషాసుర సంహారం ఘటనలు అలరించాయి.

వేడుకగా అమ్మవారికి నవరాత్రి ఉత్సవ సారె



నవరాత్రుల సారె, ఆభరణాలను ఉత్సవంగా తీసుకువస్తున్న ఆలయ కమిటీ, భక్తులు

పామూరు: దసరా నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం వాసవీమాత అమ్మవారికి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవ సారె సమర్పించారు. వాసవీమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు కోటా నరసింహారావు ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ మంచికంటి మధుసూదనరావు ఇంటి వద్ద నుంచి వాసవీమాత ఆలయం వరకు భజంత్రీల మేళతాళాల నడుమ ఉత్సవంగా అమ్మవారి మూల విగ్రహమూర్తికి అలంకరించే పట్టు చీరలు, అలంకరించే స్వర్ణ ఆభరణాలతో కూడిన సారెను తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి సమర్పించారు. అర్చకులు రాయప్రోలు తులసీనాథ్, రాఘవ సుమంత్‌శర్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశ్వనాథుని మణికంఠ సత్యనారాయణ, దరిశి జేష్, కె.హరగోపాల్, పందిటి హరీష్, సేగు కృష్ణయ్య, గురు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు సేవలు ఎనలేనివి



ఆరికట్ల వెంకటేశ్వర్లు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కొండపి: ఆరికట్ల వెంకటేశ్వర్లు సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మాజీ కన్వీనర్ గొట్టిపాటి మురళి అన్నారు. స్థానిక సచివాలయం వద్ద మాజీ జెడ్పీటీసీ ఆరికట్ల వెంకటేశ్వర్లు నాల్గవ వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ ఆరికట్ల వెంకటేశ్వర్లు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి, ఆరికట్ల కోటిలింగయ్య, వైస్ ఎంపీపీలు వేముల ప్రసాద్, రావులపల్లి కోటరాజు, బొక్కిసం సుబ్బారావు, దివి శ్రీనివాసరావు, భువనగిరి సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ, వన్నూరు, హరినారాయణ, చిన్నబ్బి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు ఆర్థికసాయం



నీలకంఠాపురంలో ఆర్థికసాయం అందజేస్తున్న దద్దాల

హనుమంతునిపాడు: మండలంలోని రెండు కుటుంబాలను వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన కాటినేని వెంకటాద్రి కుమారుడు రాఘవేంద్ర ఇటీవల మరణించడంతో గ్రామానికి వెళ్లి పరామర్శించి కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కోటతిప్పలలో మాజీ సర్పంచ్ కత్తి గురవయ్య రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. నీలకంఠాపురంలో గుండె వ్యాధితో స్టంట్ వేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న లక్ష్మయ్యను పరామర్శించారు. పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, బీసీ నాయకులు మద్ది తిరుపతయ్య, కె.నారాయణ, వైస్ ఎంపీపీ రుద్రపాటి శోభ, ఎంపీటీసీ రుద్రపా రాజు, నాయకులు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం



చిన్నకనుమళ్ల ఎస్సీ కాలనీలో కురుస్తున్న వర్షం



కొండపి ఫ్లైఓవర్ కింద భారీగా నిలిచిన వర్షం నీరు

సింగరాయకొండ: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం భానుడి ప్రతాపంతో ఎండతీవ్రతకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కానీ సాయంత్రం అయ్యేసరికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై సుమారు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో మురుగుకాల్వలు ఉధృతంగా పారాయి. ఇటీవల కాలంలో పంచాయతీ కార్మికులు రోడ్లపై చెత్త తొలగిస్తున్నారే తప్ప మురుగుకాల్వల్లో చెత్త తొలగించకపోవటంతో చాలా చోట్ల మురుగునీరు పారేవీలు లేక కాల్వలు మురుగునీటితో నిండిపోయాయి.

టంగుటూరు: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. స్థానిక పోతుల చెంచయ్య కాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది. మండలంలో 21.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం



కనిగిరిలో జెండా ఆవిష్కరణలో సీపీఐ నాయకులు

కనిగిరిరూరల్: సమ సమాజ స్థాపనే సీపీఐ లక్ష్యం అని ఆ పార్టీ రాష్ట్ర సమితిసభ్యులు సయ్యద్ యాసీన్, వై రవీంద్రబాబులు అన్నారు. సీపీఐ జాతీయ మహాసభలను పురస్కరించుకుని పట్టణంలోని దరిశి చెంచయ్య భవన్, హనీఫ్ నగర్, ఏరువారి పల్లి, గుజ్జుల యల్లమందారెడ్డి కాలనీ తదితర చోట్ల సీపీఐ జెండాలను ఆవిష్కరించారు. నాయకులు పందిటి మోహన్, ఎస్ జిలానీ, వెలుగొండయ్య, రావూరి అంజమ్మ, గుజ్జుల బాలిరెడ్డి, ఖాశింపీరా, బషీరా, పుట్టా సుబ్బారావు, పూర్ణచంద్రరాజు, సీహెచ్ పవన్ కళ్యాణ్, ఇఫ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పామూరు: ప్రజాసమస్యల పరిష్కారంపై సీపీఐ అలుపెరగని పోరాటం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్‌మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంవద్ద జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఐ 100 సంవత్సరాల ప్రస్థానంలో చేసిన పోరాటాలను వివరించారు. వజ్రాల సుబ్బారావు, ఆకుల మోహన్‌రావు, పలువురు పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు



పగిలిన పైప్‌లైన్లకు మరమ్మతులు చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పీసీపల్లి: 'పైపులైన్లు పగలడంతో ఆగిన నీటి సరఫరా' అనే కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిధిలోని పీసీపల్లితో పాటు సుమారు మూడు కాలనీలు, 3 గ్రామాలకు నీరు వెళ్లే పైపులైన్లు పగిలి నీటి సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 19న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేశారు.